క్లుప్తంగా

బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న రాధాకృష్ణ

సిరిసిల్లఅర్బన్: బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఈఎస్‌ఐ బోర్డు మెంబర్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ స్టేట్ బీడీ కార్మిక సంఘ్ రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడారు. సంబంధిత ఈఎస్‌ఐ వైద్యుడితో మాట్లాడి కార్మికులకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందించాలన్నారు. 360 రోజులు పని చేస్తేనే ఈపీఎఫ్ పింఛన్ వర్తిస్తుందని కార్మికులకు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ బీడీ కార్మిక సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చితివేర్ కిష్టయ్య, బీఎంఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, శివయ్య, చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు తొట ధర్మేందర్, రాజిరెడ్డి, కొండల్‌రెడ్డి, బీడీ కార్మికులు, ప్యాకర్లు పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలవాలి


పేదలకు చీరలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి

వేములవాడ: పేదలకు అండగా నిలిచి వారి బాగోగులు చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అన్నారు. పట్టణానికి చెందిన కోయినేని లక్ష్మి భర్త కోయినేని అంజయ్య, కుమారుడు రాజేందర్‌లు మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని పేదలకు వంద చీరలను పంపిణీ చేశారు.

జిల్లా దివ్యాంగుల భవన నిర్మాణం చేపట్టాలి


మాట్లాడుతున్న రాజేందర్

సిరిసిల్లటౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లాలో దివ్యాంగులకు భవన నిర్మాణం చేపట్టాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మంగళారపు రాజేందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సత్యసాయి సేవా మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. మంత్రి కేటీఆర్ ఈ విషయమై హామీ ఇచ్చారని, ఐదేండ్లు గడుస్తున్నా మోక్షం లేదన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు యెల్ల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి వెల్ది గణేశ్, సహాయ కార్యదర్శి బొద్దుల రవి, కోశాధికారి మామిడాల నరేశ్ పాల్గొన్నారు.

రెండు దశాబ్దాలుగా..
ఎదురుచూపు

- ప్రారంభించని కిష్టంపేట-బండపల్లి మధ్య రోడ్డు పనులు
- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- లింక్ రోడ్డుకు నిధులు మంజూరు
- ఆరు నెలలైనా టెండర్లకు దిక్కులేదు
- మిగతా నాలుగు లింక్ రోడ్లకు నిధుల మంజూరు ఎప్పుడో?

చందుర్తి: రెండు దశాబ్దాలుగా ఈ రోడ్డు ఎప్పుడు నిర్మిస్తారోనని కళ్లుకాయలు చేసుకుని ఎదురుచూస్తున్నారు. మండలంలోని కిష్టంపేట-బండపల్లి రోడ్డు పనులకు నిధులు మంజూరై ఆరు నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించలేదు. మండలంలో ప్రాధాన్యత గల ఐదు లింక్ రోడ్లు ఉండగా ఈ రోడ్డుకు రూ.25 లక్షలు కేటాయించారు. మిగతా నాలుగు రోడ్ల పరిస్థితి పూర్తి అధ్వానంగా ఉన్న వాటిని పట్టించుకునే వారే కరువయ్యారు. లింక్ రోడ్లు రెండేళ్లుగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలకు రోడ్లు కోతకు గురై కనీసం పాదచారులకు, ద్విచక్ర వాహనాలకు కూడా కష్టంగా మారింది. దీంతో పొలాల వద్దకు వెళ్లే రైతులు ఇబ్బంది పడుతున్నారు.


కోతకు గురైన చందుర్తి గచ్చు బావి నుంచి నర్సింగపూర్ లింక్ రోడ్డు

మిగిలిన వాటికి నిధులేవి?

మండలంలోని కిష్టంపేట-కట్టలింగంపేట, గుడిపేట-ఎన్గల్, ఎన్గల్-మామిడిపల్లి, చందుర్తి గచ్చుబావి నుంచి నర్సింగపూర్ గ్రామాల లింక్ రోడ్ల పనులు ఏళ్ల తరబడి నిధులు లేక మరమ్మతులకు నోచుకోకపోవడంతో కాలినడక కష్టంగానే మారింది. గ్రామ శివారులోని రైతులు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. గతంలో మార్కెట్ కమిటీ నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టే నాయకులు 8 ఏళ్లుగా తట్టెడు మొరం కూడా పోయకపోవడంతో పెద్ద, పెద్ద గుంతలతో అధ్వానంగా మారాయి. దీనికి తోడు మూడేళ్లుగా భారీ వర్షాలతో రోడ్లన్నీ వరద కోతకు గురై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. కిష్టంపేట-కట్టలింగంపేట గ్రామాల రోడ్లు నిర్మాణం పూర్తిచేస్తే చందుర్తి మండలంలోని ప్రజలకే కాకుండా కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట, మామిడిపల్లి, నిజామాబాద్, వెంకట్రావ్‌పేట, కోనరావుపుట, మలక్‌పేట, కనగర్తి గ్రామాల ప్రజలకు ఈ రోడ్డు మీదగా రుద్రంగి, కోరుట్ల పట్టణ ప్రాంతాలకు రవాణా ఎక్కువగా ఉంటుంది. వీరందరికి రవాణా కష్టాలు తీరుతాయి. ఈ ప్రాంత ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకొనైనా రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని పలు గ్రామాలు కోరుతున్నారు.

వర్షాకాలంలో పాదచారులకు నరకం

ఎన్గల్-మిడిపల్లి, ఎన్గల్-గుడిపేట, కిష్టంపేట-కట్టలింగంపేట, చందుర్తి-నర్సింగపూర్ గ్రామాల మధ్య లింక్ రోడ్లపై వర్షాకాలంలో కాలినడకే కష్టంగా మారింది. చిన్నపాటి చినుకులు కురిసిన కాలు తీసి కాలు వేసేందుకు హడలిపోతున్నారు. నాలుగు నెలల పాటు ఈ రోడ్లపై ఎక్కడ చూసిన మోకాలు లోతు బురదతో దర్శనమిస్తాయి. తమ కష్టాలను చూసి స్థానిక నాయకులు రోడ్లను నిర్మిస్తారని బాధలన్నీ వారి చెప్పుకున్న వినట్లే విని కష్టాలను విస్మరించారని ఆరోపిస్తున్నారు.

కిష్టంపేట-బండపల్లి రోడ్డుకు నిధులు

మండలంలోని అత్యవసరమని భావించి ఎమ్మెల్యే రమేశ్‌బాబు కిష్టంపేట-బండపల్లి రోడ్డుకు పంచాయతీరాజ్ శాఖ నిధుల నుంచి రూ.25 లక్షలు కేటాయించారు. దీంతో రోడ్డుకు మరమ్మతులు చేస్తే మండలంలోని ప్రజలకే కాకుండా కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి , రుద్రంగి, కథలాపూర్, కోరుట్ల పట్టణం వరకు రాకపోకలు సాగించే మండలాల ప్రజలకు ఎంతగానో దూరభారం తగ్గుతోందని భావిస్తున్నారు. ఈ నిధులు వెంటనే పనులు ప్రారంభిస్తే ప్రయోజనం ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఎన్నికల లోపే మరమ్మతు చేపట్టాలి



ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని ఉపాధి హామీలో ఆరేళ్ల కిత్రం రోడ్డు నిర్మించారు. రెండేళ్లుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డు కోత గురైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మరమ్మతు చేపట్టలేదు. ఎమ్మెల్యే ఎన్నికల ముందు నిధులు మంజూరై పనులు పూర్తి కావాలి. లేకుంటే మరో ఆరేళ్ల గడిచిన రోడ్డును పట్టించుకోరు. – పూదూరి దామోదర్‌రెడ్డి, రైతు, నర్సింగపూర్

దూరభారం తగ్గుతుంది



లింక్ రోడ్డును మరమ్మతు చేస్తే దూరభారం తగ్గుతుంది. కట్టలింటగంపేట , మల్యాల, లింగంపేట ప్రజలకు రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంది. కిష్టంపేట, జోగాపూర్. రామారవుపల్లె, బండపల్లి గ్రామాలకు రావాలంటే సనుగుల గ్రామం మీదుగా, లేదంటే మర్రిగడ్డ గ్రామం మీదుగా తిరిగి వస్తున్నారు. ఈ లింక్ రోడ్డు నిర్మాణం చేస్తే ప్రయోజనంగా ఉంటుంది. – యెల్ల దశరథం, రైతు, కట్టలింగంపేట

ఎమ్మెల్యే సహకారంతో నిధులు



బండపల్లి-కిష్టంపేట గ్రామాల మధ్య లింక్ రోడ్డుపై రవాణా అధికంగా ఉండడంతో వర్షాకాలంలో పెద్దపెద్దగా గుంతలు ఏర్పడ్డాయి. కనీసం ద్విచక్ర వాహనంపై వెళ్లేందుకు వీలులేకుండా ఉంది. ఎమ్మెల్యే రమేశ్‌బాబు నిధులు మంజూరు ఇప్పించారు. దీంతో రెండు గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతోంది. – అంబరి నరేశ్, యువకుడు, కిష్టంపేట

తొక్కుల సీజన్


మామిడికాయ తొక్కు సీజన్ మొదలైంది. పట్టణంలోని తెలంగాణచౌక్‌లో కొందరు మామిడి కాయలను తొక్కుకు అనుకూలంగా ముక్కలు చేస్తున్నారు. ఒక్కోకాయ ముక్కలు చేస్తే రూ.2 తీసుకుంటున్నారు. చాలామంది మామిడికాయలను కొనుగోలు చేసి ఇక్కడ ముక్కలుగా చేయించుకుని వెళ్తున్నారు. - వేములవాడ

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా బావి

ముస్తాబాద్: మండలంలోని మొర్రాయిపల్లెలో రహదారి పక్కనే బావి ప్రమాదకరంగా వుంది. గ్రామశివారులోనే రోడ్డును అనుకుని వున్న బావి వద్ద ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. పైగా రోడ్డు పక్కన చెట్లు ఉన్నాయి. ఏవరైనా నిర్లక్ష్యంగా వాహనం నడిపినా, బావిని గమనించకున్నా పెద్ద ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. బావి చుట్టూ కంచె ఏర్పాటు చేసి రక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: ఉష, పంచాయితీ కార్యదర్శి
సెల్ నెంబర్: 79935 98715

నేటి నుంచి సీఎం కప్ పోటీలు

సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2023కి సంబంధించి క్రీడా పోటీలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 31 వరకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో 18 క్రీడాంశములలో పోటీలను నిర్వహించనున్నారు. మూడు రోజులు పాటు మండల స్థాయిలో అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర పోటీల కొరకు ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండల స్థాయిలో గెలుపొందిన విజేతలకు 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి, ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 28 నుంచి 31 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని క్రీడల శాఖ అధికారి తెలిపారు.

హనుమాన్ భక్తులకు పాలు, మజ్జిగ, పండ్లు పంపిణీ

వేములవాడ: మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం వేములవాడ పట్టణానికి వచ్చిన హనుమాన్ దీక్షాపరులకు పాలు, పండ్లు, మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మధు మహేశ్, రఫీక్, ప్రతాప నటరాజ్, పాత సంతోష్, తోట రాజు, కళా అశోక్, ముబారక్, సలీనానాజ్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ సిద్దోగానికి ఆహ్వానం


ఆగయ్య దంపతులకు పత్రిక ఇస్తున్న గీత కార్మికులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాజన్నపేటలో నిర్వహించే గీత కార్మికుల సాంప్రదాయ వేడుక ఎల్లమ్మ సిద్దోగానికి హాజరుకావాలని కోరుతూ ఆదివారం గౌడ కులస్తులు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య నివాసానికి గడతో వెళ్లి ఆహ్వానం పలికారు. ఆగయ్య ఎల్లమ్మ గడతో నృత్యం చేశారు. అమ్మవారి దీవెనలు జిల్లా ప్రజలకు ఉండాలని వేడుకున్నారు.అలాగే జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొండపురం బాల్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ఎలుసాని మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ

వీర్నపల్లి: మండలం సీతారాం నాయక్ తండా గ్రామంలో ప్రమాదవశాత్తు మరణించిన బీఆర్‌ఎస్ కార్యకర్త బానోత్ గణేశ్ కుటుంబానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆదివారం రూ.2 లక్షల బీమా చెక్కును అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కళావతి, ఎంపీపీ భూల, సెస్ డైరెక్టర్ మల్లేశం, మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, ఎంపీటీసీ బానోత్ పద్మ, సర్పంచులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



గంభీరావుపేట: మండలంలోని నర్మాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2006-07 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. అనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యార్థులు తమ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ముస్తాబాద్: మండలంలోని తెర్లుమద్ది విద్యుత్ సబ్ స్టేషన్ మూలమలుపు వద్ద ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇల్లంతకుంట మండలం సిరికొండకు చెందిన ఉమ్మరవేని బాలకృష్ణ(30) పోతుగల్‌లో వివాహనికి హాజరై ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా, తెర్లుమద్ది నుంచి ముస్తాబాద్‌వైపు బైక్‌పై వస్తున్న నామాపూర్ వాసి సీహెచ్ శ్రీనివాస్(40) వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టాయి. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి విచారణ చేస్తున్నారు.

సంతాపం

సిరిసిల్లటౌన్: మాజీ సెస్ చైర్మన్ దోర్నాల లక్ష్మారెడ్డి ఆకస్మిక మృతి పట్ల సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు. లక్ష్మారెడ్డి ఉమ్మడి జెడ్పీ వైస్‌చైర్మన్‌గా, సెస్ మాజీ చైర్మన్‌గా, న్యాయవాది వృత్తిలో ప్రజలకు ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కోనరావుపేట: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని మల్కాపేట గ్రామానికి చెందిన ఎక్కల్‌దేవి పర్శరాములుకు రూ.40 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సర్పంచ్ లత ఆదివారం అందజేశారు.

సొంత భవనం కలేనా.?


గురుకుల పాఠశాల అద్దె భవనం

- అద్దె భవనంలో కొనసాగుతున్న గురుకుల పాఠశాల
- నాలుగేళ్ల క్రితం భూమిపూజ
- ఇప్పటికీ మొదలు కాని పనులు

ఇల్లంతకుంట: నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం 2017లో మండల కేంద్రంలో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసింది. కాని ఇప్పటి వరకు సొంత భవన నిర్మించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. ఆరున్నరేళ్లుగా అద్దె భవనాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటి వరకు నాలుగు అద్దె భవనాల్లోకి పాఠశాలను మార్చారు. అద్దె భవనాల్లో సరైన సదుపాయాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

స్థలం కేటాయింపు

గురుకుల పాఠశాల సొంత భవన నిర్మాణం కోసం ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేటలోని మోడల్ స్కూల్ సమీపంలో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని పాఠశాలకు ప్రభుత్వం కేటాయించింది. అప్పుడే పాఠశాల నిర్మాణానికి రూ.16 కోట్ల వరకు కేటాయించినా, పనులు ప్రారంభించలేదనే ఆరోపణలున్నాయి.

అద్దె భవనంలో అవస్థలు

గురుకుల బాలికల పాఠశాలలో ప్రస్తుతం 480 మంది విద్యార్థులున్నారు. వచ్చే జూన్‌లో కొత్తగా మరో 160 మంది విద్యార్థులు పాఠశాలలో చదువుకునేందుకు రానున్నారు. మొత్తం 640 మంది ఉండగా, అద్దె భవనంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి సొంత భవన నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

నిర్మాణం చేయాలి



రహీంఖాన్‌పేట గ్రామంలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో గురుకుల పాఠశాల నిర్మాణం చేయాలి. అద్దె భవనంలో ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని సొంత భవన నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.
– గన్నారం నర్సయ్య, పెద్దలింగాపూర్

ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా



గురుకుల పాఠశాలకు నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించారు. అద్దె భవనంలో విద్యార్థులకు కొంత అసౌకర్యంగా ఉన్న మాట వాస్తవమే. సొంత భవనం పనులు ప్రారంభం అయ్యేలా ప్రభుత్వ దృష్టికి సమస్య తీసుకెళ్తాం.
– సిద్దం వేణు, జెడ్పీ వైస్ చైర్మన్

ఘనంగా హనుమాన్ జయంతి


మొక్కులు చెల్లించుకుంటున్న రైతులు

ఎల్లారెడ్డిపేట: హనుమాన్ పెద్ద జయంతిని పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం హనుమాన్ ఆలయాల్లో మాలధారులు, ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని రావిచెట్టు హనుమాన్ ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకం, క్షీరాభిషేకం, చందనం పూజలు చేశారు.

వెంకన్న కల్యాణం


కల్యాణ వేడుకలకు హాజరైన భక్తులు

సిరిసిల్లఅర్బన్: పట్టణంలోని శ్రీశాల శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ 5వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణ వేడుకలను తిలకించారు. కార్యక్రమంలో పవర్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, జిందం చక్రపాణి, ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పుల విఠల్‌రెడ్డి, ధర్మకర్తలు కోడం శ్రీనివాస్, అల్లాడి సరస్వతి శ్రీనివాస్, కత్తెర సంతోషిణి, వరుణ్, మామిడాల రమణ, మెరుగు లక్ష్మణ్, ఆలయ ఈవో మారుతి పాల్గొన్నారు.

నిరుపేద పెళ్లికి ఆర్థికసాయం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కిష్టునాయక్ తండాలో మాలోతు రాజు కూతురు వివాహానికి జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.

ఆలయ వార్షికోత్సవం


హాజరైన భక్తులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగుండారంలోని గిరిజనుల ఆరాధ్యదైవమైన శ్రీజగదాంబ మాత ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గిరిజన పూజారులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పసుసంపద, పంటలను సల్లగా చూడాలని వేడుకున్నారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ వరున కృష్ణహరి, సర్పంచ్ భూక్య శంకర్, నాయకులు పాల్గొన్నారు.

పెద్దమ్మ బోనాలు


బోనాల్లో విచిత్ర వేషధారణలో భక్తులు

బోయినపల్లి: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ బోనాలు తీశారు. పెద్దమ్మ కల్యాణంలో భాగంగా మహిళలు భక్తి శ్రద్ధలతో నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా పెద్దమ్మ తల్లి ఆలయానికి వెళ్లి బోనాలు నైవేద్యంగా సమర్పించారు. పెద్దమ్మ తల్లి బోనాల్లో పలువురి విచిత్ర వేషధారణలు చూపరులను ఆకట్టుకున్నాయి. మాజీ సర్పంచు బొజ్జ లక్ష్మీరాజం, ఉపసర్పంచ్ లాల్ పర్శరాములు, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ సిద్దోగం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం సంకెపల్లి గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ సిద్దోగం సందర్భంగా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి రేణుక ఎల్లమ్మను దర్శించుకున్నారు. గౌడ సంఘం నాయకులు లక్ష్మిరాజం, రాము, బుర్ర శేఖర్, మురళీ, శ్రీనివాస్ ఉన్నారు.

శివపార్వతుల కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న పండితులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం శివపార్వతుల కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో పండితులు గుండయ్య శర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, దేవాతాహ్వానం, ప్రధాన కలశ స్థాపన, రుద్రాభిషేకం, హోమం నిర్వహించారు. అనంతరం భక్తుల సమక్షంలో స్వామివారి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అల్లాడి మురళి, చకిలం మధు, తాటిపల్లి సుధాకర్, బొమ్మకంటి భాస్కర్, చకిలం నారాయణ, రాజు, కందుకూరి రవి, గంప నాగేంద్రం పాల్గొన్నారు.